# శవమై దొరికిన హాస్టల్ విద్యార్థి

-తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల ఆందోళన





2లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 31 | జనవరి | 2026
పేజీలు : 7

# ఆఖరి రోజు భారీగా నామినేషన్లు





## -ఖమ్మంలో 27, భద్రాద్రిలో 70 స్థానాల్లో సిపిఐ నామినేషన్లు

ప్రజాపక్షం/ఖమ్మం : మున్సిపోల్స్‌కు సంబంధించి ఆఖరు రోజు శనివారం భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థుల తాకిడి మొదలైంది. ఖమ్మం జిల్లా లోని ఏదులాపురం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ కేంద్రాల్లో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం కార్పోరేషన్‌తో పాటు ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీల్లోనూ ఆఖరు రోజు భారీగానే నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల సమయం ముగిసిన తర్వాత కూడా అభ్యర్థులు ఆయా

మిగతా 2లో..





# ఎవరిదీ పాపం..!



-ఆదాయమేనా.. ప్రజల ప్రాణాలు పట్టవా..?

-నియంత్రణ లేని మద్యం అమ్మకాలు

-ఆదాయాలతో అధికారులు సంతృప్తి

నియంత్రణ లేని అమ్మకాలు అధిక ధరలతో మద్యం ప్రియులు ఆర్థికంగా నష్టోపోవడమే గాక విచ్చలవిడి తనంతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువత మద్యానికి బానిసలై జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. ఆదాయాన్ని మాత్రమే చూస్తున్న పాలకులు మద్యం ప్రియులను దోపిడీ చేస్తుండగా వ్యక్తిగత ఆదాయాన్ని భారీగా సమకూర్చుకునే దిశలో అధికారులు మద్యం విషయంలో నిబంధనలను గాలికి వదిలేశారు. ఎవరు ఎక్కడికి పోతేనేం మనకు రావాల్సింది వస్తుందన్న భావనలో ఉన్నారు. ప్రభుత్వ ఆదాయం, వ్యక్తిగత ఆదాయాల నడుమ కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. ఈ పాపం ఎవరిది పాలకులదా లేక నిబంధనలను కాలరాసి మద్యం వ్యాపారుల చేతిలో కీలుబొమ్మలుగా మారిన అధికారులదా ఎవరిదీ.

-ప్రజాపక్షం/ఖమ్మం

2లో

# పర్యాటక కేంద్రంగా ఖమ్మంకు ప్రత్యేక గుర్తింపు

-ఖిల్లా రోప్‌వే పనులపై మంత్రి తుమ్మల సమీక్ష



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరాన్ని పర్యాటక కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు తీసుకు రావడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖిల్లా రోప్‌వే నిర్మాణంతో ఖమ్మం నగరం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఖిల్లా రోప్ వే నిర్మాణ బాధ్యతలు చేపట్టిన రోప్‌వే సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సిఈవో రంజిత్ పక్రాసి తో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సమీక్షించారు. ఈ సందర్భంగా

మిగతా 2లో..

# రూ. ఐదు కోట్లిస్తానని ఒకరు.. అదనంగా ఇంకోటిస్తానని మరొకరు...



-మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానం కోసం పోటాపోటీ

-కాంగ్రెస్‌లోనూ కుదరని సఖ్యత

ప్రజాపక్షం/ ఖమ్మం : కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం పోటీ పెరిగింది. వార్డు, కౌన్సిలర్లతో పాటు ఛైర్‌పర్సన్ స్థానాలకు పలువురు పోటీపడడంతో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఖమ్మం జిల్లాలో ఓ ఛైర్మన్ స్థానం కోసం కాంగ్రెస్ నాయకుడొకరు నేను ఆరుకోట్లు ఖర్చు పెడతానని సమావేశంలో వెల్లడించగా,

మిగతా 2లో..

# ఆఖరి రోజు భారీగా నామినేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రాల్లో ఉండి నామినేషన్లను దాఖలు చేస్తున్నారు.

**సిపిఐ అభ్యర్థుల నామినేషన్ :**

కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని 60 డివిజన్లు ఉండగా అన్నింటికి సిపిఐ అభ్యర్థులు పార్టీ మద్దతుదారులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇల్లందు మున్సిపాలిటీలో మూడు స్థానాలకు, అశ్వారావుపేటలో రెండు స్థానాలకు సిపిఐ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఖమ్మం జిల్లాలోని కల్లూరు మున్సిపాలిటీలో రెండు స్థానాలకు సిపిఐ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా మధిర మున్సిపాలిటీలో 5, 6, 7, 8, 17 వార్డుకు సిపిఐ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 16 వార్డులకు సిపిఐ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఏదులాపురం పాత పంచాయతీ పరిధిలోని ఏడు వార్డులతో పాటు ముత్తగూడెంలో మూడు, జలగం నగర్, నాయుడు పేట, తాళ్లేసేతండా, మద్దులపల్లి సహా సిపిఐకి బలమైన ప్రాంతాల్లో సిపిఐ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు దండి సురేష్, ఎస్‌కె సాబీర్‌పాషా, రాష్ట్ర సమితి సభ్యులు, ఆయా ప్రాంతాల బాధ్యులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో పోటాపోటీ నామినేషన్లు :**

అధికార కాంగ్రెస్ పార్టీ గత పరిస్థితి నేడు మళ్లీ సాక్ష్యాత్కరించింది. అధికారంలో ఉన్నప్పుడు లేనప్పుడు కూడా ఆ గ్రూపుల లొల్లి కాంగ్రెస్‌ను వదిలే పరిస్థితి లేదు. అన్ని మున్సిపాలిటీలలోనూ పోటాపోటీగా కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఒక వార్డులో నలుగురైదుగురు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ పరిస్థితి మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీలలో ఎక్కువగా కనిపించింది. అశ్వారావుపేటలోనూ ఇదే పరిస్థితి ఉందని పాత కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ ల మధ్య సక్యత కొరవడిందన్న సమాచారం. దీనితో పాత కాంగ్రెస్‌కు సరైన రీతిలో టికెట్ల కేటాయింపు జరపలేదని పలు వార్డుల్లో పాత కాంగ్రెస్‌కు చెందిన వారు నామినేషన్లు దాఖలు చేశారు.

# శవమై దొరికిన హాస్టల్ విద్యార్థి

**ప్రజాపక్షం/ఖమ్మం :** హాస్టల్‌లో ఉంటూ ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థి హాస్టల్ నుంచి మాయమై చివరకు సాగర్ కాలువలో శవమై తేలాడు. చదువు కోసం హాస్టల్‌కు పంపిస్తే శవాన్ని అప్పగించారంటూ విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంతో పాటు సిపిఐ నాయకులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే... ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంకు చెందిన వస్తం సంజయ్‌కుమార్ (13) ఖమ్మం ఎన్నెస్పి క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఉంటూ ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. సంజయ్‌కుమార్ తమ్ముడు అరుణ్ కూడా ఇదే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 28న సంజయ్‌కుమార్ హాస్టల్‌లో కనిపించకుండా పోయాడు. ఈ విషయాన్ని అరుణ్ తల్లిదండ్రులతో పాటు హాస్టల్ వార్డెన్‌కు తెలిపాడు. రెండు రోజులుగా ఎక్కడ వెతికిన కానరాని సంజయ్‌కుమార్ శుక్రవారం ఖమ్మం యూపిహెచ్ కాలనీ సమీపంలో సాగర్ కాలువలో శవమై కనిపించాడు. యుపిహెచ్ కాలనీలో సమీపంలోని సాగర్ కాలువలో శవం కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ పోలీసులు శవాన్ని పరిశీలించి సంజయ్‌కుమార్‌గా నిర్ధారించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన :**

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సిపిఐ నాయకులు బాగం హేమంతరావు నేతృత్వంలో బాలుని కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన నిర్వహించారు. పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడంతో అధికారులు ఆందోళన విరమించాలని విజ్ఞప్తి చేశారు. చివరకు కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ఆందోళన విరమించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అధికారుల తో, విద్యార్థి తల్లిదండ్రులతో చర్చించి ఆందోళన విరమించేందుకు కృషి చేశారు. బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, అర్బన్ తహసీల్దార్ సైదులు, బిసి సంక్షేమ అధికారి జ్యోతి లతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి మూడు లక్షల రూపాయల పరిహారం, అవుట్‌సోర్సింగ్‌లో ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేవిధంగా అంగీకరించడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు యర్రాబాబు, విద్యార్థి సంఘాల నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



**హాస్టల్ వార్డెన్‌ను విధుల నుంచి తొలగించాలి : విద్యార్థి సంఘాల డిమాండ్**

సంజయ్‌కుమార్ మృతికి కారణమైన సంక్షేమ వసతి గృహం వార్డెన్‌ను, సంబంధిత అధికారులను విధుల నుంచి తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఏఐవైఎఫ్‌నాయకులు చింతల రమేష్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ప్రవీణ్, మస్తాన్, అశోక్, సురేష్ లు డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు.

# కౌన్సిలర్ల పోటీకి నామినేషన్ల వెల్లువ

- గందరగోళంగా పార్టీల నామినేషన్లు





**ప్రజాపక్షం/ మధిర :** ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చివరిరోజు శుక్రవారం నామినేషన్ల పర్వం ముగియనున్నడంతో వివిధ పార్టీల నుండి కౌన్సిలర్ల పోటీకి పెద్దసంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. మధిర మున్సిపాల్టీలోని 22 వార్డులకు గాను అధికార కాంగ్రెస్ పార్టీ, టిడిపి, సిపిఐ, బిఆర్ఎస్, బిజెపి, సిపిఎం, జనసేన పార్టీల నుండి అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అయితే పార్టీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించకపోవడం, బిఫామ్‌లు ఇవ్వకపోడంతో ఇష్టానుసారంగా ఇరు పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయటంతో గందరగోళంగా మారింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎక్కువగా నామినేషన్లు వేయడంతో విత్ డ్రా చేసే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కొక్కరు రెండు మూడు వార్డుల్లో నామినేషన్లు దాఖలు చేయటం కొంత అయోమయ పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మధిర మున్సిపాల్టీలో నామినేషన్లు వేయడంతో రాజకీయ పార్టీల నాయకుల్లో, పట్టణ ప్రముఖుల్లో, ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. మధిర మున్సిపాల్టీ చైర్మన్ పదవి మహిళా జనరల్‌కు కేటాయించటంతో అధికార కాంగ్రెస్ పార్టీ నుండి 21వ వార్డుకు ప్రముఖ ఆర్యవైశ్యులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హన్మంతరావు సతీమణి రంగా మధులత నామినేషన్ వేయగా కాంగ్రెస్ పార్టీ నుండి 18వ వార్డుకు కమ్మ సామాజిక వర్గానికి చెందిన మల్లాది సవిత నామినేషన్ వేయగా 4వ వార్డుకు సామినేని సుజాత నామినేషన్ వేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి లక్ష్మీ తులసీ 6వ వార్డుకు మొదటిగా నామినేషన్ దాఖలు చేశారు. దీంతో చైర్‌పర్సన్ రేస్‌లో నలుగురు మహిళలు పోటీ పడుతుండగా చైరపర్సన్ పదవికి ఎవరి పేరు ఖరారవుతోందని ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క త్వరలో తీసుకోనున్న నిర్ణయంతో పోటీలో ఉండే అభ్యర్థులు, చైర్సపర్సన్ పదవికి పోటీ చేసే అభ్యర్థి ఎవరో తెరపడనుంది. గత రెండు రోజులుగా స్తంభ్ధతగా ఉన్న రాజకీయం చివరి రోజు నామినేషన్లు ఊపందుకుని అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయటంతో ఒక్కసారిగా మున్సిపల్ ఎన్నికలు వేడెక్కింది.



# పర్యాటక కేంద్రంగా ఖమ్మంకు ప్రత్యేక గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కమిషనర్ వల్లూరి క్రాంతి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో మంత్రి తుమ్మల ఫోన్‌లో మాట్లాడారు. రోప్‌వే నిర్మాణం కోసం నిధులు విడుదల చేసి పనులు వేగవంతమయ్యేలా చొరవ తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం నగరం పర్యాటకానికి కీలక ప్రాజెక్టు, చారిత్రిక ప్రాధాన్యత కలిగిన ఖిల్లా వద్ద రోప్‌వే నిర్మాణం పూర్తయితే పర్యాటక రంగంలో కొత్త అధ్యయం మొదలవుతుందన్నారు. రోప్‌వే ద్వారా ఖిల్లాను సందర్శించే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని దీనితో ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుందన్నారు. రోప్‌వే నిర్మాణానికి అవసరమైన అన్ని సహాయ సహకరాలను ప్రభుత్వం తరుపున అందిస్తామని రోప్‌వే నిర్మాణ సంస్థకు తెలిపారు. పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా ప్రభుత్వ యంత్రాంగమంతా కృషి చేయాలన్నారు. ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు పూర్తయితే పర్యాటకుల సంఖ్య పెరగడమే కాకుండా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. హోటళ్లు, రవాణా, గైడ్ సేవలు తదితర రంగాలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు.

# ఎవరిదీ పాపం..!

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో మద్యం అమ్మకాలు ప్రభుత్వ ఆధీనంలో సాగుతుంది. ఈ మొత్తం వ్యవహారం ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఆధీనంలో జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం విక్రయాలు జరిపించాల్సిన ఎక్సైజ్ శాఖ ఆ పని చేయడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. సాధారణ ఉద్యోగి మొదలు ఉన్నతాధికారుల వరకు ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

**మద్యం వ్యాపారుల కోసమే :**

మద్యం వ్యాపారులు అధిక లాభాల కోసం బెల్ట్ షాపుల ద్వారా మద్యాన్ని విక్రయిస్తున్నారు. మద్యం దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తే ఎంఆర్‌పి ధరకు మాత్రమే విక్రయించాలి. అదే బెల్ట్ షాపులకు విక్రయిస్తే ఎంఆర్‌పి కంటే అదనంగా విక్రయించి ఎక్కువ లాభాలు పొందాలని చూస్తున్నారు. దీనితో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. గల్లీకో బెల్ట్‌షాపు పెట్టి ఎంఆర్‌పి పైన రూ. 50ల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. చాలా బెల్ట్‌షాపులు బార్ షాపులను తలపించే రీతిలో నడుస్తున్నాయి. పట్టణ, నగర శివార్లలో వెలుస్తున్న బెల్ట్‌షాపులు ఘర్షణలకు అడ్డాలుగా మారుతున్నాయి.

**అంతా తెలిసే జరుగుతుంది :**

అక్రమ మద్యం విక్రయాలు బెల్ట్‌షాపుల నిర్వహణ మొత్తం ఎక్సైజ్ అధికారులకు తెలిసే జరుగుతుంది. ఏ గ్రామంలో ఎక్కడ బెల్ట్‌షాపు ఉందో ఎక్సైజ్ అధికారులకు తెలుసు. ఏ బెల్ట్‌షాపులో ఏ మద్యం విక్రయిస్తున్నారు, ఎంఆర్‌పిపై ఎంత అదనంగా విక్రయిస్తున్నారో తెలుసునన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీనికి తోడు ఎక్సైజ్ అధికారులే మద్యం సిండికేట్లను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. యుక్త వయస్సులోనే మద్యానికి బానిసలై అనారోగ్యం భారీనపడుతున్న వారు కొందరైతే ఆర్థికంగా చితికిపోయిన వారు మరికొందరు. ఒక పక్క సంక్షేమ పథకాలు కుడిచేతితో ఇచ్చి ఎడమచేతితో మద్యం పేరిట దోపిడీ చేస్తున్నారన్న ఆవేదన వ్యక్తమవుతుంది.

# రూ. ఐదు కోట్లిస్తానని ఒకరు.. అదనంగా ఇంకోటిస్తానని మరొకరు...

(మొదటిపేజీ తరువాయి)

మరొకరు అదనంగా కోటి రూపాయలు ఖర్చు చేస్తానని.. తనకే ఛైర్మన్ స్థానం కేటాయించాలని చెప్పినట్లు ప్రచారం జరుగుతుంది. మొత్తంగా ఈ పోటీ తీవ్ర కావడంతో పార్టీ వర్గాలుగా చీలిపోయింది. పలు చోట్ల కాంగ్రెస్ నుంచే ఒక్కో వార్డుకు నలుగురైదుగురు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపల్ ఛైర్మన్ స్థానాలు జనరల్ మహిళలకు రిజర్వు కావడంతో పోటీ తీవ్రంగా ఉంది. మధిర, వైరాలో రాజకీయ సమీకరణలతో పాటు ఇతరత్రా సమీకరణలు కూడా సాగుతున్నాయి. ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా భావిస్తున్న వార్డుల్లో కూడా కాంగ్రెస్ నుంచి ఇతరులు నామినేషన్ దాఖలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

**చర్చల దశలోనే పొత్తులు :**

ఒకట్రెండు మున్సిపాలిటీలలో తప్ప అది కూడా బిఆర్ఎస్, సిపిఎం మినహాయిస్తే మిగిలిన రాజకీయ పార్టీల మధ్య పొత్తులు చర్చల దశలోనే ఉన్నాయి. నామినేషన్ల అనంతరం చర్చించుకుందామనే రీతిలో మొత్తంగా నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీతో సయోధ్య కుదరడం ఎంత కష్టమో గెలిచిన పంచాయతీ ఎన్నికలు ఇప్పటి మున్సిపల్ ఎన్నికల తీరు రుజువైందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఆ పార్టీలోనే సయోధ్య కుదిరే పరిస్థితి లేనందున ఇక మిగిలిన పక్షాలతో చర్చలు సాగడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అశ్వారావుపేట లాంటి చోట సిపిఐకి ఒక స్థానం ఖరారు చేసి తిరిగి ఆ స్థానంలో కూడా కాంగ్రెస్ నామినేషన్లు వేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. మొత్తంగా పొత్తులు నామినేషన్ల ఘట్టం ముగిసిన తర్వాత కూడా చర్చల దశలోనే ఉన్నాయి.

# కల్లూరులో సిపిఐ నామినేషన్



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని శుక్రవారం నామినేషన్ ప్రక్రియ చివరి రోజున 16వ వార్డుకు సిపిఐ తరఫున దామల దయాకర్ రావు నామినేషన్ వేశారు. 11వ తేదీ జరిగే మున్సిపాలిటీలో జరిగే ఎన్నికలకు గాను కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పలు కార్మిక సంఘాలలో బలంగా ఉంటూ వారి సమస్యలు పరిష్కారం కోసం కృషిచేస్తూ కార్మిక సంఘాలతో పాటు రాజకీయపరంగా ఎన్నికలలో సిపిఐ తరఫున నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతంలో పలు విభాగాల్లో కార్మిక సంఘాలను నడుపుకుంటూ వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తూ 11 తేదీన జరిగే ఎన్నికలకు పోటీ బరిలో ఉన్నట్లు తెలిపారు. 16 వార్డులో స్థానిక సమస్యలు మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని దయాకర్ రావు ఈ సందర్భంగా తెలిపారు.

## శ్రీనివాసరెడ్డికి సిపిఐ ఘన నివాళి



ప్రజాపక్షం/అశ్వాపురం: దోపిడీ రహిత సమాజ నిర్మాణమే అమరజీవి కామ్రేడ్ కొల్లు శ్రీనివాసరెడ్డి లక్ష్యమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు మున్నా లక్ష్మీ కుమారి అన్నారు. శుక్రవారం మొండికుంటలోని సిపిఐ కార్యాలయం వద్ద కొల్లు శ్రీనివాసరెడ్డి విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఐ మండల సహాయ కార్యదర్శి కమటం సురేష్ అధ్యక్షతన జరిగిన 11వ వర్ధంతి సభలో వారు ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు బలమైన ప్రజా పోరాటాలకు నిలువుటద్దం నిర్మించి, అనతి కాలంలో మృత్యువడి చేరారని, శ్రీనివాస్‌రెడ్డి ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రెడ్డి అరుణ, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు కమటం సురేష్, నాయకులు కోడి వెంకన్న, కొడాలి వెంకటేశ్వరరావు, శిషన్, శ్రీద్రక్షలు, దంతాల జగదీష్, కొల్లు ఆశా కుమారి, తేమిటం సంగు, పగిడిపల్లి సమ్మయ్య, కరటం అంజయ, మంగళశిరిర మనిక, కుటుంబ బంధువులు మర్రి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పౌరహక్కుల పట్ల అవగాహన అవసరం




ప్రజాపక్షం/చింతకాని : పౌరహక్కుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ బాబ్జీప్రసాద్ పేర్కొన్నారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని లచ్చగూడెంలో సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కులు , విధులు, భాధ్యతలు పట్ల వారికి అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొప్పుల రజని మట్లాడుతూ అందరూ సమానమేనని, ఇంకా ఏమైనా సాంఘిక దురాచారాలు కుటవివక్షత తక్కువ ఎక్కువ అనే భేదాభిప్రాయాలు ఎవరైనా చూపితే తమతోపాటు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సీతయ్య,సాంఘిక సంక్షేమాధికారి వెంకటేశ్వరరావు, గిర్దావర్లు జగదీష్ జీపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కళాకారుడు వెంకటేశ్వర్లుకు ప్రశంసాపత్రం



ప్రజాపక్షం/ మధిర : మధిర బంజా రాకాలనీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న ఏకపాత్రాభినయం, పౌరాణిక నాటిక పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను చూపిన కళాకారుడు మారబత్తుల వెంకటేశ్వర్లుకు ప్రశంసాపత్రాన్ని అందచేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మామునురు గ్రామానికి చెందిన మారబత్తుల వెంకటేశ్వర్లు తన కళలను గుర్తించి అభినందన తెలిపి మెమొంటో ప్రశంసాపత్రాన్ని కళాపరిషత్ అధ్యక్షులు గడ్డం సుబ్బారావు, సీనియర్ కాంగ్రెస్ పార్టీనాయకులు బుచ్చిరామయ్య చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేకమంది మధిర ప్రాంత కళాకారులు తన నటనద్వారా జాతీయస్థాయిలో అనేక అవార్డులను పొంది మధిరకి దేశవ్యాప్తంగా పేరు ప్రతిష్టలు తెచ్చారని ఆయన అన్నారు. అనంతరం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మంది కళాకారులు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం, నాటక సన్నివేశాల రక్తి కట్టించాయి. ఈ కార్యక్రమంలో రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, గడ్డం ప్రసాద్, బాణాల రామకృష్ణ, సీతారామాంజనేయ కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరావు, గడ్డం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల కేంద్రం ఎర్రుపాలెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు పాల్గొని గాంధీజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచానికి అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలను అందించిన గాంధీ మార్గం ఎప్పటికీ అనుసరణీయమని అన్నారు. హక్కుల సాధనకై శాంతియుత పోరాట మార్గాన్ని ఆచరణలో చూపిన మహాత్మాగాంధీ చిరస్మరణీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు అనుమోలు వెంకటకృష్ణారావు, పంచి సాంబశివరావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్.జానీబాషా, ఎర్రుపాలెం సర్పంచ్ నంద్రు అశ్విని, క్లస్టర్ ఇన్‌చార్జి కడియం శ్రీనివాసరావు, శీలం వెంకట్రామిరెడ్డి, యూత్ నాయకులు దేవరకొండ గాంధీ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గ విబేధాలు..!

**-పోటా పోటీగా నామినేషన్లు దాఖలు**
**-అయోమయంలో కాంగ్రెస్ శ్రేణులు**





ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాల్ ఎన్నికల నేపద్యంలో అధికార కాంగ్రెస్ పార్టీలో ఒక్కసారిగా వర్గ విబేదాలు భగ్గుమన్నాయి. ముఇన్స పాలిటీలో 20 వార్డుల్లో పొంగులేటి వర్గం, భట్టివిక్రమార్క వర్గం పోటా పోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. చైర్మన్ పదవి ఏనా కంటే నాకంటూ పోటీ పడ్డ రెండు వర్గాలు మధ్య జరిగిన చర్యలు ఫలించకపోవడంతో ఇరువర్గాల మధ్య ఒక్కసారిగా వైరాలో రాజకీయం వేడెక్కింది. ఎవరికి వారే వారి అనుచరులతో వార్డుల్లో నామినేషన్లు దాఖలు చేయించారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఇరువర్గాలను ఒకటి చేయడంలో విఫలమయ్యారా? ఏం జరిగిందనేది కూడా తెలియని పరిస్థితి. అసలు వైరా కాంగ్రెస్‌లో ఏం జరుగుతుంది. కేడర్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు అనేది కూడా ఇప్పుడు పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. గత కొన్ని రోజులుగా ఇరు వర్గాల మధ్య విబేధాలు ఉన్నప్పటికి కనిపించకుండా అందరూ బాయి బాయి అన్న విధంగా కనిపించారు. ఇప్పుడు సై అంటే సై అంటున్నారు. అధికార కాంగ్రెస్ రెండు వర్గాల మధ్యవ ఏసిన వార్డు నామినేషన్‌లు విరమించుకుంటారా పోటీలో ఉంటారు అనేది కూడా ఆసక్తికరమైన చర్చ జరుగుతూ ఉంది. చివరి రోజు నామినేషన్ల పర్వం కావడంతో పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. అయితే అధికార కాంగ్రెస్ పెద్దలు వైరా మున్సిపాలిటీలో జరుగుతున్న పరిణామాలపై ఏ విధంగా స్పందిస్తారో రెండు వర్గాలు ఒకటైతాయా, పోటీలో కూడా సై అంటారా అనేది కూడా వేచిచూడాల్సిందే.

# వినూత్న ఆహ్వానం.. వృత్తిపై మమకారం..!

**-టాబ్లెట్ షీట్ పై పెళ్లి పత్రిక**
**-వార్తల్లో నిలుస్తున్న మెడికల్ వెడ్డింగ్ కార్డ్**
**-అందరినీ ఆశ్చర్యపరుస్తున్న**
**జూలూరుపాడు యువకుడి పెళ్లి కార్డు**








ప్రజాపక్షం/జూలూరుపాడు: టాబ్లెట్ స్ట్రిప్పుపై నవీన్ శిరీషల వివాహ బంధం నెట్టింట వైరల్ అవుతున్న వినూత్న ఆహ్వాన పత్రిక. మెడికల్ రిప్రజెంటేటివ్ వరుడు. ఫార్మసిస్ట్ వధువు. ఒకే రంగం కావడంతో వినూత్న ఆలోచన. జూలూరుపాడు మండలం కాకర్లలో వెరైటీ పెళ్లి కార్డు. వృత్తి పట్ల గౌరవాన్ని చాటుతూ బంధుమిత్రులను ఆహ్వానిస్తున్న జంట.సాధారణంగా పెళ్లి పత్రికలు అంటే దేవుళ్ల బొమ్మలు, రంగు రంగుల డిజైన్లు, పట్టు వస్త్రాల అలంకరణలతో కనిపిస్తాయి. కానీ, జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన ఒక యువకుడు తన పెళ్లి పత్రికను అత్యంత వినూత్నంగా, తాను చేస్తున్న వృత్తికి అద్దం పట్టేలా రూపొందించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అది పెళ్లి పత్రికా లేక టాబ్లెట్ షీటా అని భ్రమపడేలా ఉన్న ఆ వెడ్డింగ్ కార్డ్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. కాకర్ల గ్రామానికి చెందిన కిన్నెర భాస్కర్ ధనమ్మ దంపతుల కుమారుడు కిన్నెర నవీన్ ఎంబీఏ. పూర్తి చేసి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. నవీన్‌కు వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన శిరీషతో వివాహం నిశ్చయమైంది. శిరీష కూడా ఎం.ఫార్మసీ పూర్తి చేసి విజయవాడలోని పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్‌లో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తోంది. వధూవరులిద్దరూ మెడికల్ రంగానికి చెందిన వారు కావడంతో, తమ వివాహ ఆహ్వానాన్ని కూడా అదే శైలిలో ఉండాలని భావించారు. ఫిబ్రవరి 4వ తారీఖున వధువు ఇంటి వద్ద వివాహం నిశ్చయించారు. ఈ క్రమంలోతమ వృత్తిపై ఉన్న మమకారాన్ని చాటుకోవడమే కాకుండా, పదిమందికీ గుర్తిండిపోయేలా ఏదైనా చేయాలని ఆలోచించిన నవీన్, తన పెళ్లి పత్రికను ఒక టాబ్లెట్ స్ట్రిప్పు (టాబ్లెట్ స్ట్రిప్) ఆకారంలో డిజైన్ చేయించాడు. పత్రిక ముందటి భాగంలో సాధారణంగా టాబ్లెట్ షీట్‌పై ఉండే వివరాల తరహాలోనే పెళ్లి తేదీ, సమయం, వేదిక, వధూవరుల క్వాలిఫికేషన్లను ముద్రించారు. వెనుక భాగంలో టాబ్లెట్లు ఉండే ఖాళీలను చూపిస్తూ, ఇది ఒక మెడికల్ స్ట్రిప్పు అనే అనుభూతిని కలిగించేలా జాగ్రత్త పడ్డాడు.ఆకట్టుకుంటున్న కార్డు క్రియేటివిటీ. ఈ కార్డులో వ్వాడిన పదజాలం కూడా మెడికల్ స్టైల్‌లోనే ఉండటం విశేషం." Warning: Dear Friends Please Don't Miss My Wedding" అంటూ సరదాగా హెచ్చరిస్తూనే, తమ వివాహానికి రమ్మని కోరడం బంధుమిత్రులను ఆకట్టుకుంటోంది. ఈ వినూత్న ఆహ్వాన పత్రికను చూసిన వారు ''వృత్తిపై ఇంత ప్రేమ ఉండాలా'' అంటూ మెచ్చుకుంటున్నారు. ఫిబ్రవరి 4న జరగనున్న ఈ వివాహానికి సంబంధించిన ఈ వెరైటీ వెడ్డింగ్ కార్డ్ ఇప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లా తో పాటు ఇతర జిల్లాలో ఉన్న స్నేహితు లో సైతం చర్చనీయాంశమైంది. తమ వృత్తి పట్ల ఉన్న అంకితభావాన్ని, ప్రత్యేకతను చాటుకున్న ఈ జంటను స్థానికులు మరియు సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు అభినందిస్తున్నారు.

# జిరాంజి కొత్త బిల్లును వ్యతిరేకిద్దాం



ప్రజాపక్షం/ బోనకల్ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పేరుమార్చి కొత్తగా తీసుకువచ్చిన జిరాంజి బిల్లుతో పేద కూలీల పొట్టను కొట్టేందుకు కేంద్రంలోని ప్రభుత్వం కుట్రకు తెగబడిందని సిఐటియు మండల కన్వీనర్ గుగులోత్ నరేష్, జిల్లా నాయకులు బోయిన్‌పల్లి వీరాబాబు, రైతు సంఘం మండల నాయకులు దొండపాటి సత్యనారాయణ మండిపడ్డారు. స్థానిక రావినూతల హైస్కూల్‌లో ఉన్న గాంధీజీ విగ్రమానికి పూలమాలలు వేసి వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన అనంతరం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు నష్టం కలిగించే జిరాంజి బిల్లును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా 2005లో కేంద్రంలోని అప్పటి యుపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. మతోన్మాదం, కార్పొరేట్ పెట్టుబడిదారి దోపిడి విధానాలను ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకుంటామని గాంధీ విగ్రహం సాక్షిగా ప్రతిజ్ఞ చేశారు. ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో కార్మికులు, కర్షకులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు పంతు, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా నాయకులు డాక్టర్ గోపి, జిఎంపిఎస్ జిల్లా నాయకులు బోయెనుబోయిన గురవయ్య, వార్డు మెంబర్ షేక్.పటాన్ అఫ్జల్, ధరావత్ కృష్ణ, రైతు సంఘం, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

# పాల్వంచలో ఆసుపత్రి సీజ్

**- కఠిన చర్యలు తీసుకొంటాం : జిల్లా వైద్యాధికారి**



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ కిన్నెరసాని రహదారిలో నిభంధనలకు వ్యతిరేకంగానిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్‌ను జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్ సీజ్ చేశారు. అర్హత కలిగిన వైద్యుల పేరుతో అర్హత లేని వైద్యులతో వైద్య సేవలను అందిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఆయన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్కానింగ్ గది, ఎక్స్‌రే గదులను, రికార్డులను పరిశీలించారు. రోగులతో నేరుగా అందిస్తున్న వైద్యంపై అడిగి తెలుసుకొన్నారు. ఆసుపత్రికి సంభంధించిన అనుమతులకు సంభంధించిన పత్రాలను అడిగారు. దీనితో మావద్ద అందుబాటులో లేవని, యాజమాన్యం కూడా టూర్‌కు వెళ్ళారని సిబ్బంది తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో నిర్వాహణలో వివిధ లోపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. భవన సెల్లార్ కేవలం పార్కింగ్‌కు మాత్రమే వినియోగించాలని కానీ వివిధ రకాల ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారని అన్నారు. పూర్తి స్థాయి అనుమతులు లేకుండానే కేవలం అనుమతి ధరఖాస్తులతోనే ఆసుపత్రిలో వైద్య సేవలను ప్రారంభించారని గుర్తించినట్లు తెలిపారు. ఇది నిభంధనలకు వ్యతిరేకమన్నారు. దీనితో ఆసుపత్రిని సీజ్ చేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపిలు, పిఎంపీలు కేవలం ప్రాథమిక వైద్యాన్ని మాత్రమే చేయాలని అన్నారు. ప్రాథమిక వైద్యశాలలో ఇంజెక్షన్‌లు వేయటం, రక్త,మూత్ర,తదితర వైద్య పరీక్షలకు సిఫారసు చేయటం, (ఐవి) సెలైన్ బాటిల్స్ ఎక్కించటం లాంటివి చేయకూడదన్నారు. ఎవరైనా స్థాయికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిసి మోహన్, డిపిఎంఒ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధకుడు కెసిఆర్‌పై సర్కార్ కుట్ర

**-సిట్ నోటీసులు జారీ పట్ల సారపాక టౌన్**
**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా**



ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర సాధకుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై కాంగ్రెస్ సర్కార్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తుందని ఫోన్ ట్యాపింగ్ కేసు అంటూ సిట్ నోటీసులు జారీ చేయడం పట్ల బిఆర్ఎస్ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం సారపాక ప్రధాన సెంటర్‌లో పట్టణ కమిటీ అధ్యక్షులు కొనకంచి శ్రీను ఆధ్వర్యంలో నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పూరితంగా కేసీఆర్‌పై సిట్ నోటీసులు జారీ చేయడాన్ని రాజకీయ ప్రతీకార చర్యగా అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతగాకనే ఫోన్ ట్యాపింగ్ డ్రామాలు ఆడుతుందని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, స్వరాష్ట్ర సాధకుడు కేసీఆర్‌కు సిట్ నోటీసులు పంపడం యావత్ తెలంగాణకే అవమానమన్నారు. ప్రజా ఉద్యమాలను నడిపించి స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన మహానుభావుడు కేసీఆర్‌ను కాంగ్రెస్ సర్కార్ సిట్ పేరుతో నోటీసులు ఇచ్చి అవమానించడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఈ ఘటనపై మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ తప్పుడు చర్యలకు స్వస్తి చెప్పి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి, వార్డు సభ్యులు తిరుపతి ఏసోబు, సారపాక పట్టణ యువజన విభాగ అధ్యక్షులు సోము లక్ష్మీ చైతన్యరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తుపాలకు రవికుమార్, బెజ్జంకి కనకాచారి, సారపాక టౌన్ ఉపాధ్యక్షులు చట్టు ఆంజనేయులు, సురేష్, మోహన్, నేతాజీ, పాల్గొన్నారు.

# అశ్వాపురంలో బిఆర్ఎస్ నాయకుల రాస్తారోకో



ప్రజాపక్షం/అశ్వాపురం : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి సిట్ నోటీస్ ఇవ్వడం కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కోడి అమరేందర్ అన్నారు. శుక్రవారం అశ్వాపురం ప్రధాన రహదారిపై ఆయన ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌కి సిట్ నోటీసులు ఇవ్వడం పరిపాలన విధివిధానాలు తెలియని వాళ్ళు పాలకులుగా ఉండటం దురదృష్టకరమని, పాలన చేతకాక, కేవలం రాజకీయ కక్షతోనే సిట్ పేరిట బిఆర్ఎస్ నాయకులను వేధిస్తున్నది కాంగ్రెస్ సర్కార్, రేవంత్ దుర్మార్గపు పాలనకు ప్రజలే అడ్డుకట్ట వేస్తారని విమర్శించారు. కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేసిన పథకాలు అమలు చేయలేకనే ఈ దద్దమ్మ ప్రభుత్వం ఇలా డ్రామాలకి తెరలేపారని ఆరోపించారు. మున్సిపాలిటీ ఎన్నికల వేళ మురికి రాజకీయం చేస్తున్న రేవంత్ సర్కార్ అని అన్నారు. ఈకార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపిపి కొల్లు మల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కంచుగట్ల వీరభద్రం, సీనియర్ నాయకులు ఈదరా సత్యనారాయణ, కందుల కృష్ణార్జునరావు, సూదిరెడ్డి గోపిరెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెన్న అశోక్ కుమార్, నక్కనబోయిన పాపారావు, చుంచు రామ్మూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చల్లా రాజేష్, గొల్లగూడెం సర్పంచ్ కోంద్రు సోమయ్య, ఆనందపురం సర్పంచ్ మురం సమ్మయ్య, ఉప సర్పంచ్ దేవనబోయిన మహేష్, శివారపు డాక్టర్ బాబు, కదారి వేణు, మందా హుస్సేన్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు గజ్జి లోహిత్, తెల్లం రాములు, తేజావత్ నరసింహ, గుంజల కృష్ణ, మణికం గణేష్, అలవాలా రమేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# కెసిఆర్‌కి ఫోన్ ట్యాపింగ్ పేరుతో సిట్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గం



ప్రజాపక్షం/కారేపల్లి: కేసీఆర్‌కి ఫోన్ ట్యాపింగ్ కేసు పేరిట సిట్ నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన, కక్ష సాధింపు రాజకీయానికి నిదర్శనమని బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, మాజీ దిశా కమిటీ మెంబర్ లకావత్ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రతిరూపం కేసీఆర్, కేసీఆర్‌కి నోటీసులు ఇవ్వటం అంటే యావత్ తెలంగాణ సమాజానికే నోటీసులు ఇచ్చినట్టేనని స్పష్టం చేశారు. ఉద్యమ నాయకుడిగా, రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడిపై ఇలాంటి చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవటమే అన్నారు. రేవంత్‌రెడ్డిలో తీవ్ర అభద్రతాభావం పెరిగిపోయిందని, తన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో కప్పిపుచ్చుకునేందుకు సిట్‌లు, కమిషన్ల పేరుతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల వేళ ప్రజలను కన్ఫ్యూజ్ చేయాలన్న దురుద్దేశంతోనే ఈ నోటీసులు డ్రామా చేస్తున్నారూ, తెలంగాణ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాదు కానీ, పూటకో డైవర్షన్ డ్రామాలు చేస్తూ రేవంత్‌రెడ్డి కాలం గడుపుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి అవివేకపూరిత, పిల్ల చేష్టలతో కూడిన పాలనలో ప్రభుత్వ సంస్థలు స్వతంత్రత కోల్పోయి కేవడం కీలుబొమ్మలుగా మారాయని, తెలంగాణ చరిత్రను లిఖించిన నాయకులు, రాష్ట్రాన్ని సాధించి దేశానికి ఆదర్శంగా నిలిపిన కేసీఆర్ వ్యక్తిత్వానికి, ప్రతిష్టకు రేవంత్‌రెడ్డి పిల్ల చేష్టలతో మలినం అంటించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇలాంటి కక్ష సాధింపు చర్యలు చివరికి ఆయనే ప్రజల్లో నవ్వులపాలు అవుతారని విమర్శించారు.

## నేడు సిఎం కప్ క్రీడలు



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ పట్టణంలో గల సోషల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల/ కళాశాలలో నేడు మండల స్థాయి సిఎం కప్ క్రీడలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పాల్వంచలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం పిడిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికా ప్రకారం అటువంటి ఆటంకం కలగకుండా క్రీడలను విజయవంతం చేయాలని సూచించారు. పట్టణ,మండల పరిధి వివిధ పాఠశాలలో పంచాయితీ వారీగా జరిగిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనభరిచిన క్రీడాకారులతో మండల స్థాయి క్రీడలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు



ప్రజాపక్షం/పాల్వంచ : దేశ స్వాతంత్రం కోసం పోరాడిన నాయకుల ఆశయాలను సాధించటానికి యువత, ప్రతీ ఒక్కరు వారి బాటలో నడవాలని పాల్వంచ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ అన్నారు. మండల పరిధి లక్ష్మిదేవిపల్లిలో గల పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.మందుగా జాతిపిత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అహింసా, సత్య, శాంతి, సేవ లాంటి సిద్ధాంతాలతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మాగాంధీ జీవితం ప్రతీ భారతీయుడికి మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జే. మాధవి, డి. రమేష్, కొండలరావు, విజయ ప్రసాద్, పొట్లపువ్వు శ్రీనివాసరావు, పారెల్లి శ్రీనివాస్, ఫర్వీన్, ఎన్. శ్రీదేవి, బాబ్జి, లీల, విమల, దీపిక, కరీమా, రమేష్, పవన్, ఈ.శ్రీను, బి. రమేష్, హారిక, తేజస్విని, శివ, బి. శ్రీను, నరేష్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని యువకుడికి గాయాలు

**-పరిస్థితి విషమం, ఆసుపత్రికి తరలింపు**



ప్రజాపక్షం/కారేపల్లి: ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ లారీ వస్తున్న విషయం గమనించకుండా లారీని ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలు అయిన ఘటన శుక్రవారం మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కామేపల్లి మండల పరిధిలోని జోగ్గూడెంలో పోస్‌మ్యాన్‌గా పని చేస్తున్న వారణాసి ప్రవీణ్ కుమార్ విధులలో భాగంగా ఉత్తరాలను క్రాస్ రోడ్డులో బట్వాడా చేసేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో క్రాస్ రోడ్ మూలమలుపు తిరుగుతుండగా ఖమ్మం నుండి కారేపల్లి వెళుతున్న లారీని ఢీకొట్టగా కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. తలకు తీవ్ర గాయాలు కాగా కారేపల్లి ఎస్ఐ బైరు గోపి వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని పోలీసుల వాహనంలో తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. తీవ్రంగా గాయపడిన వారణాసి ప్రవీణ్ కుమార్ ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా చీపురుపల్లి మండల వాసి. కాగా పోస్టల్ శాఖలో నాలుగు నెలల క్రితమే పోస్‌మ్యాన్‌గా ఉద్యోగం పొంది కామేపల్లి మండల పరిధిలోని జోగ్గూడెంలో విధులు నిర్వర్తిస్తున్నాడు.

## రెండు రోజుల పాటు కొనసాగనున్న సీఎం కప్ క్రీడలు



ప్రజాపక్షం/కారేపల్లి : రెండు రోజులు పాటు మండలంలో నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీలను విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. సింగరేణి మండలంలో ఉన్న పలు పాఠశాలకు సంబంధించిన క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. శుక్రవారం, శనివారం వరకు జరుగు ఈ క్రీడల్లో ప్రధానంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగ, అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయని మండల అధికారులు తెలిపారు. సింగరేణి మండల పరిధిలోని ఉన్న పాఠశాల, కళాశాల విద్యార్థులే కాకుండా గ్రామ స్థాయి క్రీడాకారులు సైతం ఈ పోటీలో పాల్గొనొచ్చనీ తెలిపారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయని, గ్రామీణ క్రీడాకారులు, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ రమేష్, మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు, ఎస్ఐ గోపి, కారేపల్లి జెడ్‌పిఎస్ఎస్ ప్రధానోపాధ్యాయులు శ్యామ్, కేజీబీవీ ప్రత్యేక అధికారి జి ఝాన్సీ, సౌజన్య, పీఈటీలు సిహెచ్ కృష్ణయ్య, సరస్వతి, మోస, బాబు, అనంత్, అనూష, సీతారాం, రామారావు పాల్గొన్నారు.

# జోరుగా సిపిఐ అభ్యర్థుల నామినేషన్లు









**– పాల్గొన్న భాగం హేమంతరావు, దండి సురేష్**

ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 28, 29, 30, 31, 32, 16, 3 వార్డులకు సిపిఐ అభ్యర్థులు శుక్రవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. తొలుత ఎర్రజెండాల రెపరెపల నడుమ ద్విచక్రవాహన ర్యాలీగా నామినేషన్ కేంద్ర వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థుల నామినేషన్లలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, నాయకడు చిన్న సైదిరెడ్డి పాల్గొన్నారు. అంతేకాకుండా ఇప్పటికి వరకు 19, 20,21, 23, 1తో పాటు పలువార్డులు కలిపి 15వరకు నామినేషన్లు దాఖలయ్యాయి. సిపిఐ మున్సిపాలిటీ నాయకులు, యువజన సంఘం సభ్యులు, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

–ప్రజాపక్షం/ఖమ్మంరూరల్









## వింత వ్యాధితో వీధి కుక్కలు..!

**-ఇతర పశువులకు వ్యాపిస్తుందన్న ఆందోళనలో రైతులు**

ప్రజాపక్షం/ ఖమ్మం : కరోనా తర్వాత రకరకాల వ్యాధులు మనుషులతో పాటు పశు పక్ష్యాదులను ఇబ్బందులు పెడుతున్నాయి. అంతుచిక్కని వ్యాధులతో ఇప్పుడు వీధి కుక్కలు ఇబ్బందులు పడుతున్నాయి. చర్మమంతా పొట్టు ఊడిపోయి విపరీతమైన దురదతో బాధపడుతున్నాయి. ఒక ఊర్లోనో రెండు ఊర్లలోనో కాదు ఉమ్మడి ఖమ్మం జిల్లా మొత్తం ఇదే పరిస్థితి. చిన్న పిల్లలు చూస్తే భయపడే పరిస్థితి. గతంలో తెల్లజాతి పశువులకు ఇటువంటి చర్మవ్యాధి సోకింది. చాలా పశువులు చనిపోయాయి. తెల్లజాతి పశువుల నుంచే కుక్కలకు ఈ చర్మవ్యాధి సంక్రమించిందని భావిస్తున్నారు. ఈ కుక్కల నుంచి ఇతర జంతువులకు కూడా వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుని చర్మవ్యాధితో బాధపడుతున్న కుక్కలకు వైద్యం అందించకపోతే ఈ అంటువ్యాధి మరింత వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వీధి కుక్కల కాటుకు గురై ఇబ్బందులు పడుతున్న దశలో ఇప్పుడు ఈ చర్మవ్యాధి మరో రకంగా భయపెడుతుంది.





## ఎన్నికల్లో బిఆర్‌ఎస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి : సండ్ర



ప్రజాపక్షం/వైరా: భారత రాష్ట్ర సమితి పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం వైరాలోని వైరా మున్సిపాలిటీ బిఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి పథంలో ఉందంటే భారాసానే కారణమని, ఖమ్మం జిల్లాలో పలు మున్సిపాలిటీల్లో కాంగ్రేస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని మున్సిపాలిటీలు అభివృద్ధి పథంలో ముందుకు ఉండాలంటే టిఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బొచ్చు విజయ్‌కుమార్, కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేవ్వరరావు, ధూలిపాళ్ళ నాగేశ్వరరావు, మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, లాల్‌మహ్మద్, నూకల వాసు, మేదరమెట్ల రాము, అప్పం సురేష్, కారుకొండ బోస్, లింగారావు, వజినేపల్లి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## మసీద్ అభివృద్ధికి కృషి చేస్తా

**-కట్టా కృష్ణార్జున్‌రావు**



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాల్ పరిధిలోని నాల్గో వార్డులో ఉన్న మసీద్ నందు శుక్రవారం బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు ముస్లీం మత పెద్దలతో కలిసి మసీదులో జరిగిన ప్రార్థనలో పాల్గొన్నారు. మసీదు అభివృద్ధికి తనవంతు చేయూతను అందిస్తానని తెలిపారు. గతంలో కూడా పలు సందర్భంలో మసీదు సమస్యల పట్ల స్పందించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా రానున్న రోజుల్లో కూడా మసీద్ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు పోతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో షేక్ లాల్‌మహ్మద్, ముస్లీం మతపెద్దలు పాల్గొన్నారు.

## సిఎం కప్ క్రీడలు ప్రారంభం



ప్రజాపక్షం/వైరా: వైరా మండలంలోని రెబ్బవరం ఉన్నత పాఠశాలలో సిఎం కప్ మండలస్థాయి క్రీడలను వైరా ఎంపిడివో సక్రియ శుక్రవారం ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. వయసు గ్రూపులతో కాక ఎవరైనా ఈ క్రీడల్లో పాల్గొనే విధంగా క్రీడలను నిర్వహించారు. శుక్రవారం పురుషులకు శనివారం స్త్రీలకు క్రీడలు అండ్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపిడివో సక్రియ మాట్లాడుతూ గ్రామ సీమల్లో క్రీడలు క్రీడాస్ఫూర్తి సన్నగిల్లుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడల నిర్వాహణకు ఆదేశించిన నేపద్యంలో పురుషులకు, స్త్రీలకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రెబ్బవరం గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల జ్యోతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.సురేష్, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, గుత్తా రామారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ 60 డివిజన్లలో సిపిఐ నామినేషన్లు






**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సిపిఐ అభ్యర్థులు 60కి 60 డివిజన్లలో నామినేషన్లు సమర్పించారు. దీంతో కార్పొరేషన్‌లో సిపిఐ సింగిల్ ఫైట్‌కు సిద్ద పడుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌తో డివిజన్ల సర్దుబాటు ఎటూ తేలికపోవడంతో తప్పని సరీ పరిస్థితుల్లో అన్ని డివిజన్లలో నామినేషన్లు వేయాల్సి వచ్చింది. ఫిబ్రవరి 3వ తేది ఉపసంహరణ నాటికి ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నటు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీతో సిపిఎం పొత్తు కుదుర్చున్నట్లు తెలుస్తోంది. సిపిఎంకు 21,31 డివిజన్లను కాంగ్రెస్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక బిఆర్ఎస్, బిజేపి పార్టీల అభ్యర్థులు ఇప్పటి వరకు ఎవ్వరితో ఎలాంటి పొత్తులు పెట్టుకోకుండానే నామినేషన్లు దాఖలు చేశారు.

**పురపోరు రసత్తవత్తరం...**

కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది. సిపిఐ,కాంగ్రెస్‌ల మధ్య సీట్లు సర్దుపాటు కాకుంటే ఒంటరిగా పోటే చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంతో జత కట్టి ఉన్న సిపిఐకి గత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఒకట్రెండు చోట్ల తప్ప కాంగ్రెస్ ఎక్కడా మద్దతు పలకలేదు. అయినప్పటికీ భారీ స్థానాలతో పాటు మేజర్ గ్రామ పంచాయితీలను సైతం సిపిఐ అభ్యర్థులు కైవసం చేసుకుని సత్తా చాటారు. ఆ ఎన్నికల ఫలితాల అనంతరం సిపిఐతో పొత్తు పెట్టుకుని ఉంటే బాగుండంటూ కొందరు కాంగ్రెస్ శ్రేణులు బాహాటంగానే చర్చించాయి. గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు చులకన చేసి మాట్లాడటంతో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ఆ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు నడిపించారు. దీంతో కాంగ్రెస్ ఖంగు తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ అధిష్టానం పొత్తు వ్యవహారంలో సుముఖంగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయనే చర్చ సాగుతోంది. కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం సిపిఐ ఒంటరిపోరుకు దిగితే పెద్ద ఎత్తున డివిజన్లలో సత్తా చాటి మేయర్ స్థానాన్ని కైవసం చేసుకునే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు వాదన. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌కు నెల రోజుల ముందునుండే కాంగ్రెస్ పెద్దనాయకులు డివిజన్ల పరిధిలో కలియతిరిగి హామీలు గుప్పించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో సిపిఐకి మంచి పట్టు ఉండటంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి.

# జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లో మార్చి 6, 7 తేది లలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్ ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి సీతక్క ఆవిష్కరించారు. శుక్రవారం సమ్మక్క సారక్క ల జాతర వద్ద ఆవిష్కరించారు. ఎకోస్ ఆఫ్ ది పాస్ట్, బీమ్స్ ఆఫ్ లైట్ ఎక్స్ ప్లోరింగ్ ది సైంటిఫిక్ పినామినా బిహైండ్ తెలంగాణ అర్కిటెక్చర్ అనే అంశం పై మార్చి 6,7 తేదీ లలో జాతీయ స్థాయి లో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో మంచి అంశం పై సదస్సు నిర్వహించటం అభినందనీయం అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు పరిశోధనల పై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. సదస్సు ను విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా జాతర లో సేవలు అందించేందుకు వచ్చిన ఎన్ఎస్ఎస్ విభాగం వాలంటీర్ల నుప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ నర్సింగ్ శ్రీనివాసరావు, కాలేజీ ఆకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస రావు, ఈసం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా బార్ కౌన్సిల్ ఎన్నికలు




**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** బార్ కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్‌లో ఎన్నికలు జరగగా మొత్తం 990 ఓట్లకు గాను 887 ఓట్లు నమోదైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. న్యాయవాదులు ఉత్సాహంగా బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఐఏఎల్ నాయకులు, కార్యకర్తలు దుస్సా జనార్థన్ గెలుపును కాంక్షిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. పోలింగ్ కేంద్రం వద్ద దుస్సా జనార్థన్‌ను గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ నాయకులు మాధవరావు, లతీఫ్, శేషగిరి, కొల్లికొండ శరత్‌బాబు, శివరామకృష్ణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# 11వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా వినోదరావు



**ప్రజాపక్షం/ సత్తుపల్లి :** సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల్లో 11వ వార్డు నుంచి ఊటుకూరు వినోద రావు నామినేషన్ దాఖలు చేశారు. వినోదరావును బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య బలపరిచింది. వినోదరావు సత్తుపల్లిలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించే వారు. నగరంలో అందరికి సుపరిచితుడైన వినోదరావు 11వ వార్డులో నామినేషన్ వేయడంతో గెలుపు ఖాయమన్న ప్రచారం జరుగుతుంది.

# పోలీసులు అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి రోహిత్ రాజ్




**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో గల నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్‌పి రోహిత్ రాజ్ ఆ నామినేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అంవాఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా చ చూడాలని ఎస్‌పి ఆదేశించారు. గంపులు గుంపులుగా రావడం, నినాదాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేదమని స్పష్టం చేశారు. సమస్యాత్మక పోలింక్ కేంద్రాల వద్ద కుట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేపడతామని ఈ సందర్భంగా ఎస్‌పి తెలిపారు. సిసి కెమేరాల పర్యవేక్షణ, మెటల్ డిటెక్టర్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి భద్రతా చర్యలు సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసు వారికి సమాచారం ఇందించాలని కోరారు. జిల్లాలో శాంతియుత,స్వేఛ్ఛాయుత, నిష్పక్షపాత పద్ధతుల్లో ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని ఎస్‌సి స్పష్టం చేశారు.

# స్పర్శ్ లేప్రోసి అవగాహన ఉద్యమం



**ప్రజాపక్షం/మణుగూరు:** మహాత్మా గాంధీ వర్ధంతి ను పురస్కరించుకొని జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలో గల అన్ని ఆరోగ్య ఉప కేంద్రాల్లో స్పర్శ్ లేప్రోసి అవగాహన ఉద్యమం పై ప్రతిజ్ఞ చేయడం జరిగింది. దేహంపై ఎక్కడైనా రాగి రంగుమచ్చలు ఉండి స్పర్శ లేకున ట్లయితే వారిని దగ్గర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపవలసిందిగా డా. నిశాంత్ రావు సూచించారు. రామానుజవరం పంచాయతీ కార్యాలయం నందు లేప్రోసి పై అవగాహన కల్పించి ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విజయనగరం గ్రామంలో జరుగుచున్న ఫ్రై డే డ్రై డే సందర్శించి గ్రామస్తులతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని దోమ తెరలు ఉపయోగించాలని సూచించారు. సూపర్ వైజర్ స్వరూప, రాంప్రసాద్ పాల్గొన్నారు.

# 'సమ్మక్క-సారలమ్మ'లను దర్శించుకున్న పాయం



**ప్రజాపక్షం/మణుగూరు:** అత్యంత ఆధ్యాత్మిక వైభవంతో కన్నులపండుగగా జరుగుతున్న మేడారం "సమ్మక్కసారలమ్మ జాతర" మహోత్సవంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ఆ తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించుకొని ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి, ఆ సమ్మక్క సారలమ్మ మహాదీవెనలు అందుకున్నారు.

# మహర్షి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తికి కృత్రిమ కాలు



**ప్రజాపక్షం/కరకగూడెం:** ఓ రోడ్డు ప్రమాదం ఆ వ్యక్తి జీవితాన్ని అతలాకుతలం చేసింది. గత కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన యాక్సిడెంట్‌లో ఎడమ కాలు ను కోల్పోయిన ఆ వ్యక్తి అచేతనంగా మారాడు. ఈ నేపథ్యంలో నేను ఉన్నాను అంటూ పినపాక మండలానికి చెందిన మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తోలెం శ్రీనివాసరావు ముందుకు వచ్చారు. వివరాలు కరకగూడెం మండలం గోళ్లగూడెం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యులు ముదురు కాళ్ల సారంగపాణి 2019లో జరిగిన రోడ్డు ప్రమాదం లో తన ఎడమ కాలు కోల్పోయాడు. ఆ నాటి నుంచి కాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తోలెం శ్రీనివాసరావు బాధిత వ్యక్తి ని పరామర్శించారు. సారంగపాణి దుస్థితి దాతల దృష్టి కి తీసుకవేళ్లారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన దాతలు శ్రీనివాసరావు, కస్తూరి దంపతులు సారంగపాణి కి కిక్కృత్రిమ కాలు అమరిక కు ఆర్థిక సహాయం అందించారు. కాగా జున్ను నాగరాజు అనే వ్యక్తి సహాయంతో, విజయవాడలోని ఇవోల్యూషన్ సెంటర్ లో మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తోలెం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సారంగపాణి ఎడమ కాలుకు కృత్రిమ కా లు అమర్చారు. ఈ సందర్భంగా దాతలకు, మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావుకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపా రు. దాతలు ముందుకు వస్తే మరింతమంది నిరుపేదలకు సేవ చేస్తానని మహర్షి స్వచ్ఛంద సేవ సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

# చదువుతో పాటు క్రీడలు చాలా అవసరం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** చదువుతోపాటు క్రీడలు చాలా అవసరమని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతా రాములు పేర్కొన్నారు. మండలం లోని బోదుల బండ లో ముఖ్యమంత్రి కప్2026 మండల స్థాయి క్రీడలను శుక్రవారం ప్రారంభించారు. క్రీడాకారులతో పాటు ఆటలు ఆడి ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు క్రీడలలో సత్తా చాటాని సూచించారు. నేలకొండపల్లి గురుకుల విద్యార్థిని రూప జాతీయ స్థాయి బాక్సింగ్ కు ఎంపిక కావటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గ్రామాలలో దాగి ఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకితీసుకొచ్చేందుకు పోటీలు దోహదపడతాయని అన్నారు. బాలుర, బాలికలకు పోటీలలో సత్తా చాటి జిల్లా, రాష్ట్ర స్థాయిలో కప్ ను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.